ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 18 సంచిక: 353 | బుధవారం, 20 ఆగస్ట్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



# ఉప రాష్ట్రపతిగా తెలుగువాడిని గెలిపించుకుందాం

## చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్‌లకు నా విజ్ఞప్తి

పీవీ తర్వాత తెలుగువాడిని కీలక పదవిలో కూర్చుండబెట్టే ఛాన్స్ వచ్చింది

తెలుగు రాష్ట్రాల నేతలు ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతివ్వాలి

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

"చంద్రబాబు, కేసీఆర్, జగన్, పవన్ కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేస్తున్నా. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తెలుగు వాడిని గెలిపించుకుందాం" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పీవీ నరసింహారావు తర్వాత తెలుగు వ్యక్తిని కీలక పదవిలో కూర్చోబెట్టే అవకాశం వచ్చిందని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఇండియా' కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను ఎన్డీయే దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్న కూటమి ఒకవైపు, రాజ్యాంగాన్నే రద్దు చేయాలని చూస్తున్న కూటమి మరోవైపు ఉందని ఆయన అన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఏకతాటి పైకి వచ్చి 'ఇండియా' కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్, మజ్లిస్ సహా అన్ని పార్టీలు జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. రాజకీయాలకు అతీతంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆనాడు ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు ఎన్టీఆర్ మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో పీవీపై పోటీ పెట్టకుండా గెలిపించారని తెలిపారు. తెలుగు వ్యక్తి అత్యున్నత స్థానంలో ఉండాలనే భావనతో

..మిగతా 2లో

**మోదీ భజనలో కేంద్ర మంత్రులు బిజీ**

సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

02

# కాళేశ్వరం కమిషన్ నివేదిక



హైకోర్టుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు

పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్

పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదన్న కేసీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపణ



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషన్లు హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదని, ఆ కమిషన్ సమర్పించిన నివేదికను కొట్టివేయాలని వారు కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు కేసీఆర్, హరీశ్ రావు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపించారు. ప్రభుత్వానికి ఏది కావాలో కమిషన్ నివేదిక ఆ విధంగా ఉందని వారు పేర్కొన్నారు. కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ

..మిగతా 2లో



# విద్యుత్ శాఖలో చలనం

కేబుళ్ల తొలగింపుపై డిప్యూటీ సీఎం ఆదేశాలు

వైర్లు యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి

ఏడాది సమయం ఇచ్చినా ఆపరేటర్లు స్పందించలేదు

ప్రజల ప్రాణాలతో చెలగాటం సరికాదు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

02

# నెహ్రూ చేసిన తప్పు అదే..

దేశాన్ని రెండుసార్లు విభజించారు

ఒప్పందం వల్ల రైతులకు తీవ్ర అన్యాయం

జవహర్ లాల్ నెహ్రూపై ప్రధాని మోదీ ఫైర్

గతాన్ని వదిలి ప్రస్తుత సమస్యలపై మాట్లాడండి

కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ



02

# గంజాయి ఆగడాలు

గంజాయి పెడ్లర్లుగా పట్టుబడ్డ భార్యా భర్తలు

ఉద్యోగం పోవడంతో దంపతులిద్దరూ గంజాయి విక్రేతలుగా..

జాబ్ వెతుక్కోకుండా ఇద్దరూ కలిసి క్రిమినల్ పథకం

గంజాయి తీసుకు వచ్చి అమ్మాలని చూసి కటకటాలకు

02



# రాజకీయ కక్షతోనే యూరియా ఇవ్వట్లేదు

యూరియా తీసుకురావాల్సిన బాధ్యత కిషన్ రెడ్డి, బండి సంజయ్‌దే

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టేందుకే కుట్రలు

కిషన్ రెడ్డి ఢిల్లీలో ఉన్నా రాష్ట్ర సమస్యలు పట్టించుకోవట్లేదు

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికార ఒప్పందం

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌పై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన, తెలంగాణకు రావాల్సిన యూరియా సరఫరా విషయాన్ని కేంద్రం నుంచి వెంటనే తేవాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ కక్షతోనే కేంద్రం యూరియాను అడ్డుకుంటోందని ఆరోపించారు. రైతులు ఎరువుల కొరతతో ఆందోళనలో

..మిగతా 2లో



# గూఢచారి పావురం కలకలం

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో వెలుగులోకి

బాలుడికి అనుమానాస్పదంగా దొరికిన పక్షి

పావురం కాలికి కోడ్ రింగ్, రెక్కలపై అక్షరాలు

గూఢచారి పావురంగా అనుమానిస్తున్న గ్రామస్తులు

పావురాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

02

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



డ్రైనేజ్, స్టాఫ్ కొరత, పరికరాల సమస్యలు పరిష్కరిస్తాం

కొత్త ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటు, నిబంధనలు పాటించాలి

లేకపోతే క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటాం

గాంధీ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహ

02

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
20.08.2025
బుధవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com




## మోదీ భజనలో కేంద్ర మంత్రులు బిజీ

- సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర బీజేపీ కేంద్ర మంత్రులపై ఫైర్ అయ్యారు. ఇక ఈ ట్వీట్ లో భాగంగా.. రాష్ట్ర రైతాంగానికి అవసరం మేరకు.. యూరియా సరఫరా చేయకుండా.. నిర్లక్ష్య, వివక్ష పూరిత వైఖరి ప్రదర్శిస్తోన్న మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని, మోసపూరిత వైఖరిని ఎండగడుతూ.. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో గొంతు కలిపి పార్లమెంట్ వేదికగా తెలంగాణ రైతుల పక్షాన నిలిచిన శ్రీమతి ప్రియాంక గాంధీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాష్ట్ర రైతాంగ అవసరాల మేరకు యూరియా సరఫరా చేయాలని, మేం లేఖల రూపంలో, విజ్ఞప్తుల రూపంలో పదే పదే కోరినా కేంద్రం స్పందించకపోవడం దారుణం అంటూ పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగానికి అండగా నిలవాల్సిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు మోదీ భజనలో బిజీగా ఉన్నారని మంది పడ్డారు. మన రైతుల కోసం మోదీ సర్కారు పై వత్తిడి తెచ్చేందుకు మాతో కలిసి రావాల్సిన బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్ లో పత్తా లేరని రాసుకొచ్చారు. అంతేకాకుండా గల్లీలో లొల్లి చేయడానికి ఉత్సాహం చూపే వాళ్లు, ఢిల్లీలో మోదీని ప్రశ్నించడానికి ఎందుకు భయపడుతున్నారు!? అంటూ ప్రశ్నించారు. మోదీ అంటే భయమా! భక్తా!? అంటూ ట్వీట్ లో పేర్కొన్నారు.

## ఉప రాష్ట్రపతిగా తెలుగువాడిని గెలిపించుకుందాం

**మొదటిపేజీ తరువాయి**

ఎన్టీఆర్ సహకరించారని తెలిపారు. ఇప్పుడు మరోసారి తెలుగు నేతలంతా ఎన్టీఆర్ స్ఫూర్తిగా సహకరించాలని ముఖ్యమంత్రి అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చారని, న్యాయమూర్తిగా, లోకాయుక్తగా దేశానికి సేవలు అందించారని తెలిపారు.



## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- డ్రైనేజ్, స్టాఫ్ కొరత, పరికరాల సమస్యలు పరిష్కరిస్తాం
- కొత్త ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటు, నిబంధనలు పాటించాలి
- లేకపోతే క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటాం
- గాంధీ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీ ఆస్పత్రిని సందర్శించి పేషెంట్లు, అటెండెంట్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆస్పత్రిలో డ్రైనేజ్ సమస్య, ఎలక్ట్రిసిటీ, ఫైర్ సర్వీసులు, నర్సింగ్ విభాగంలో కొరతలు ఉన్నాయని గుర్తించామని తెలిపారు. మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు అన్నీ ఒకే ఫ్లోర్‌లో ఉండాలనే అభిప్రాయాలు కూడా వచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆస్పత్రుల సంఖ్య పెరిగినా, పరికరాలు సరిపోవడం లేదని, క్రిటికల్ కేసుల్లో స్టాఫ్ కొరత ఎక్కువగా ఉన్నందున దీనిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి వెల్లడించారు. పేషెంట్ అటెండెంట్ల కోసం ప్రత్యేకంగా అకామిడేషన్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని, సీఎస్ ఆర్ కింద శాశ్వత నిర్మాణం చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గాంధీ ఆస్పత్రిలో రెండు వేలకుపైగా బెడ్స్ ఉన్నందున వాటికి తగిన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. పాత పరికరాలను తొలగించి, కొత్త పరికరాలతో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఐవీఎఫ్ సెంటర్లలో నిబంధనలు అతిక్రమిస్తున్న కొన్ని క్లినిక్‌లపై చర్యలు ప్రారంభమయ్యాయని, కొన్నిటిని ఇప్పటికే మూసివేశామని వెల్లడించారు. అలాగే పెట్ల బురుజు, కొండాపూర్‌లో కొత్త ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఇప్పటికే కొన్ని చోట్ల పాజిటివ్ ఫలితాలు వచ్చాయని వివరించారు. హాస్టల్ నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని, పరికరాల నిర్వహణ, స్టాఫ్ నియామకాలు వంటి అంశాలపై త్వరలోనే పూర్తి స్థాయి నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. “ప్రభుత్వం ఈ సమస్యలను సీరియస్‌గా తీసుకుంటోంది... త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయి” అని ఆయన స్పష్టం చేశారు.



# విద్యుత్ శాఖలో చలనం

- కేబుళ్ల తొలగింపుపై డిప్యూటీ సీఎం ఆదేశాలు
- వైర్లు యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి
- ఏడాది సమయం ఇచ్చినా ఆపరేటర్లు స్పందించలేదు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం సరికాదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



హైదరాబాద్ మహానగరంలో పండగ వేళ విషాదం వరుసగా దాడి చేస్తోంది. గత రెండు రోజుల్లోనే కరెంట్ షాక్‌ల కారణంగా మొత్తం ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, మరొకరు ప్రాణాలతో పోరాడుతున్నారు. ఆదివారం రాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రామంతాపూర్ గోఖుల్‌నగర్‌లో నిర్వహించిన రథోత్సవం సమయంలో విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే ఐదుగురు మృతి చెందారు. మరో నలుగురు గాయపడగా, వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతుల సంఖ్య ఆరుకు పెరిగింది. మంగళవారం చాంద్రాయణగుట్ట బండ్లగూడలో మరో విషాదం చోటు చేసుకుంది. 22 అడుగుల వినాయకుడి విగ్రహాన్ని తరలించే సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో ఇద్దరు యువకులు ధోని (21), వికాస్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అదే రోజు అంబర్‌పేటలో కూడా ప్రమాదం జరిగింది. వినాయక మండపానికి పందిరి కడుతున్న సమయంలో కరెంట్ వైర్లు తగలడంతో రామ్ చరణ్ అనే వ్యక్తి షాక్‌కు గురయ్యాడు. అతడి పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ వరుస ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారితీశాయి. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రామంతాపూర్, బండ్లగూడ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల తర్వాత వారు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. వర్షాల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుళ్లను తొలగించే పనులు ప్రారంభించారు. ఉప్పల్, రామంతాపూర్, చిలకానగర్‌లలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ స్తంభాలపై వేలాడుతున్న కేబుళ్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ఆదేశించారు. అనుమతి లేకుండా కనెక్షన్లు ఇస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడటం సహించబోమని భట్టి స్పష్టం చేశారు.

# గంజాయి ఆగడాలు

- గంజాయి పెడ్లర్లుగా పట్టుబడ్డ భార్యా భర్తలు
- ఉద్యోగం పోవడంతో దంపతులిద్దరూ గంజాయి విక్రేతలుగా..
- జాబ్ వెతుక్కోకుండా ఇద్దరూ కలిసి క్రిమినల్ పథకం
- గంజాయి తీసుకు వచ్చి అమ్మాలని చూసి కటకటాలకు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

డబ్బుకు లోకం దాసోహం అంటారు. అలాంటి డబ్బు ఎలాంటి పనులు అయినా చేయిస్తుంది. ఉద్యోగం పోయిన ఇద్దరు దంపతుల్ని గంజాయి పెడ్లర్లుగా మార్చింది. అటు గంజాయి కోసం కొంత మందిని కిడ్నాపర్లుగా మార్చింది. మొత్తంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ రెండు ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి. హైదరాబాద్‌లో ఇద్దరు భార్యాభర్తలు గంజాయి పెడ్లర్లుగా పట్టుబడ్డారు. బహుశా పోలీసులకు ఇలాంటి వారిని పట్టుకోవడం ఇదే ఫస్ట్ టైమ్. ఐతే ఇద్దరు భార్యభర్తలు బాగానే చదువుకున్నారు. ఉద్యోగాల్లో ఇబ్బంది రావడంతో వదిలి పెట్టేశారు. వేరే ఉద్యోగాలు వెతుక్కోవాలి. కానీ అప్పటికే గంజాయికి అలవాటు పడ్డ వారిద్దరూ ఓ క్రిమినల్ పథకం వేశారు. గంజాయి కొట్టేవాళ్ల డేటా ఉంది. జస్ట్ గంజాయి తీసుకు వచ్చి అమ్మితే లాభాలతోపాటు తాము కూడా గంజాయి సేవించవచ్చని ప్లాన్ రెడీ చేశారు. తమ ప్లాన్ అమలు చేసేందుకు అంతా రెడీ చేసుకున్నారు. ఇద్దరూ కలిసి ఒడిశాకు బస్సులో బయల్దేరారు. అక్కడ చెరో 10 కిలోల వరకు గంజాయి కొనుగోలు చేశారు. తిరుగు ప్రయాణంలో మాత్రం భార్య, భర్త వేర్వేరుగా బస్సులో రిటర్న్ అయ్యారు. ఇక్కడకు తీసుకు వచ్చిన గంజాయిని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, కార్పొరేట్ ఉద్యోగులకు అమ్మాలనేది వారి ప్లాన్. కానీ వారి ప్లాన్ ఎంజీబీఎస్ బస్టాండ్‌లోనే బెడిసి కొట్టింది. సిటీలో అడుగు పెట్టిన భర్తను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా బైక్ వదిలేసి పారిపోయేందుకు రెడీ అయ్యాడు. కానీ పోలీసులు ఛేజ్ చేసి మరీ పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న 2 బ్యాగుల్లో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతన్ని విచారించగా.. భార్య విషయం కూడా బయట పెట్టాడు. దీంతో ఆమెను కూడా అరెస్ట్ చేశారు. మొత్తంగా వారిద్దరి దగ్గర నుంచి 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. లావిష్ లైఫ్ కోసమే గంజాయి పెడ్లర్లుగా మారినట్లు విచారణలో వారు చెప్పుకొచ్చారు. మరోవైపు సిటీలో గంజాయి బ్యాచ్‌లు అరాచకం సృష్టిస్తున్నాయి. గంజాయి కొనుగోలు చేసేందుకు డబ్బులు లేక.. మరోవైపు గంజాయి దొరకకపోవడంతో పిచ్చెక్కినట్లు ప్రవర్తిస్తున్నారు. అంతే కాదు ఏకంగా రోడ్ల మీదకు వచ్చి కిడ్నాప్‌లు చేస్తున్నారు. ఇలాగే ఓ ఆటో డ్రైవర్‌ను గంజాయి బ్యాచ్ కిడ్నాప్ చేసింది. అతన్ని బండ్లగూడలో కిడ్నాప్ చేసి.. అదే ఆటోలో సిటీలోని చాలా ప్రాంతాలు తిప్పారు. డబ్బులు కావాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోవడంతో మరింత రెచ్చిపోయి దాడికి పాల్పడ్డారు. చివరికి డబ్బులు కావాలని చెప్పి ఆటో డ్రైవర్ భార్యకు ఫోన్ చేసి తీసుకున్నారు. ఆ తర్వాత ఆటో డ్రైవర్ని వదిలి పెట్టారు. ఆటో డ్రైవర్ నేరుగా వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయికి డబ్బులు లేకపోవడంతో కిడ్నాప్ చేసినట్లు వారు ఒప్పుకున్నారు. గతంలో ఓ హత్య కేసులో వారు నిందితులుగా ఉన్నారని పోలీసులు తెలిపారు. మొత్తంగా హైదరాబాద్‌లో గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయి. గంజాయి పెడ్లర్లను, కన్జూమర్స్‌ను కట్టడి చేయాలని సిటీ జనం కోరుతున్నారు.



## కాళేశ్వరం కమిషన్ నివేదిక

**మొదటిపేజీ తరువాయి**

ఘోష్ సమర్పించిన నివేదికకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను స్వీకరిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.



## రాజకీయ కక్షతోనే యూరియా ఇవ్వట్లేదు


**మొదటిపేజీ తరువాయి**

ఉన్న వేళ, కిషన్ రెడ్డి ఢిల్లీలో నిద్రపోతున్నాడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రైతుల కష్టాలను విస్మరిస్తూ, బీజేపీ నేతలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశారని గుర్తుచేశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికార ఒప్పందం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టేందుకు ఈ కుట్ర జరుగుతోందని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు సమంజసం కాదని మహేష్ గౌడ్ హితవు పలికారు.

# గూఢచారి పావురం కలకలం

- నిజామాబాద్ జిల్లా బోధన్‌లో వెలుగులోకి
- బాలుడికి అనుమానాస్పదంగా దొరికిన పక్షి
- పావురం కాలికి కోడ్ రింగ్, రెక్కలపై అక్షరాలు
- గూఢచారి పావురంగా అనుమానిస్తున్న గ్రామస్తులు
- పావురాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



నిజామాబాద్ జిల్లాలోని బోధన్ మండలంలో ఒక పావురం తీవ్ర కలకలం రేపింది. ఆ పావురం కాలికి ఒక కోడ్ రింగ్ ఉండటం, దాని రెక్కలపై కొన్ని సంకేత అక్షరాలు రాసి ఉండటంతో అది గూఢచర్యానికి ఉపయోగించే పావురమనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. బోధన్ మండలం, భవానిపేట గ్రామంలో ఒక మైనర్ బాలుడికి ఈ పావురం అనుమానాస్పద స్థితిలో కనిపించింది. దానిని పట్టుకుని పరిశీలించగా, దాని కాలికి ఒక రింగ్, రెక్కల కింద కొన్ని అక్షరాలు ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఈ విషయాన్ని గ్రామస్తుల దృష్టికి తీసుకువెళ్లాడు. పావురాన్ని చూసిన గ్రామస్తులు అది సాధారణ పావురం కాదని, గూఢచర్యం కోసం వాడే పక్షి కావచ్చని అనుమానించారు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటీన గ్రామానికి చేరుకున్న పోలీసులు పావురాన్ని పరిశీలించారు. కాలికి రింగ్, రెక్కలపై అక్షరాలు ఉండటాన్ని గుర్తించారు. ఆ పావురాన్ని తమ అదుపులోకి తీసుకున్నారు. ఈ పావురం ఎక్కడి నుంచి వచ్చింది? దాని కాలికి ఉన్న రింగ్‌లోని కోడ్, రెక్కలపై ఉన్న అక్షరాల అర్థం ఏమిటనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# నెహ్రూ చేసిన తప్పు అదే

- దేశాన్ని రెండుసార్లు విభజించారు
- ఒప్పందం వల్ల రైతులకు తీవ్ర అన్యాయం
- జవహర్ లాల్ నెహ్రూపై ప్రధాని మోదీ ఫైర్
- గతాన్ని వదిలి ప్రస్తుత సమస్యలపై మాట్లాడండి
- కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో నెహ్రూ చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారని, తద్వారా దేశ రైతాంగానికి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. మంగళవారం జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ లైబ్రరీ భవనంలో జరిగిన ఈ సమావేశంలో మోదీ మాట్లాడుతూ, "నెహ్రూ దేశాన్ని ఒకసారి కాదు, రెండుసార్లు విభజించారు. మొదట రాడ్‌క్లిఫ్ లైన్‌తో, ఆ తర్వాత సింధు జలాల ఒప్పందంతో దేశానికి నష్టం చేకూర్చారు" అని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం కింద సింధు నది జలాల్లో 80 శాతం నీటిని పాకిస్థాన్‌కు ధారాదత్తం చేశారని ఆయన మండిపడ్డారు. ఆ తర్వాత తన కార్యదర్శి వద్ద ఈ ఒప్పందం వల్ల ఎలాంటి ప్రయోజనం కలగలేదని నెహ్రూ స్వయంగా తన తప్పును అంగీకరించారని మోదీ తెలిపారు. ఈ ఒప్పందం పూర్తిగా రైతు వ్యతిరేకమని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును కాలరాసేందుకు నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మోదీ మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచారని విమర్శించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాకే వారి అభివృద్ధి మొదలైందని అన్నారు. ఎన్డీయే హయాంలో దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోందని అన్నారు.



### నెహ్రూను నిందించడం అలవాటుగా మారింది: ప్రియాంక

ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, తమ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికే పదేపదే నెహ్రూను నిందిస్తోందని ఆమె విమర్శించారు. "గతాన్ని పదేపదే తవ్వడం మానేసి, వర్తమానంలో జరుగుతున్న విషయాలపై సమాధానం చెప్పాలి. ఓట్ల దొంగతనం ఆరోపణలపై ఎందుకు మౌనంగా ఉన్నారు? ప్రజలకు జవాబుదారీగా ఉండాలి" అని పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రియాంక డిమాండ్ చేశారు.





# గత 48 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసాయి

- ప్రజలు దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- 43 వేల క్యూసెక్కుల నీటిని సింగూర్ నుంచి విడుదల
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ ఆగస్టు 19 (ప్రజా స్వరం)**

గడిచిన 48 గంటల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయని అధికార యంత్రాంగం ప్రజల సహాయక చర్యల్లో నిమగ్నమై ఉందని కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. మంగళవారం కౌడిపల్లి మండలం తునికి గ్రామంలో వర్షానికి కూలిన ఇంటిని పరిశీలించి అనంతరం ఊర చెరువు అలుగును నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి సంబంధిత తాసిల్దార్ తో కలిసికలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధైర్యపడవద్దు ప్రభుత్వ యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉందని తెలిపారు. పురాతన ఇండ్లలో నివసించే వారిని ముందే గుర్తించడం జరిగిందని ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకుంటూ వారికి పునరావాసం కల్పించడం జరిగింది అన్నారు. ఊర చెరువు ను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచన చేశారు. సింగూర్ నీటి ప్రవాహ ఉధృతి పెరుగుతుందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, సింగూర్ నీటి మట్టం పెరుగుతుందని సింగూరు ప్రాజెక్టు నుండి 43 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు






# లంచం తీసుకుంటు పట్టుబడ్డ తహసీల్దార్, సర్వేయర్

- రూ. 15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మున్సిపల్ ఉద్యోగి
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఏసీబీ దాడుల్లో
- రెండు సంఘటనలో ముగ్గురు ఉద్యోగుల అరెస్టు

**వికారాబాద్ , ఆగస్టు 20 (ప్రజాస్వరం):**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంగళవారం ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో ముగ్గురు అధికారులు పట్టుబడ్డారు. రంగారెడ్డి జిల్లా ఆమన్గల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల దాడులు చేసి చేసిన తహసీల్దార్ సీహెచ్ లలిత, సర్వేర్ రవి లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. రైతు పాసు బుక్కులో జెండర్ కరెక్షన్ కోసం డబ్బులు డిమాండ్ చేయడంతోరైతు నుంచి గతంలోనే రూ. 50 వేలు లంచం తీసుకున్న తహసీల్దార్, సర్వేయర్ లు మళ్లీ లక్ష రూపాయలు కావాలని రైతు వద్ద డిమాండ్ చేశారు . దీంతో రైతు ఏసీబీ ని ఆశ్రయించడంతో తహసీల్దార్, సర్వేయర్ లపైఏసీబీ అధికారులు దాడుచే దాడులు చేయగాలంచం డిమాండ్ నిర్ధారణ కావడంతో ఏసీబీ అధికారులుఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.కాగా లంచం లంచం డిమాండ్ చేసిన వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ ఉద్యోగి ఒక్కరు కూడా పట్టుబడ్డారు. వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ కార్యాలయంలో రూ.15 వేల రూపాయలు లంచం తీసుకుంటూ మంగళవారం తాండూర్ మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ బి.రమేష్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన తాండూరు పురపాలక సీనియర్ అసిస్టెంటు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన తాండూరు పురపాలక సీనియర్ అసిస్టెంట్ రమేష్ ఫిర్యాదుదారుడు తాను నిర్మించుకున్న ఒక షెడ్డుకు ఇంటి నంబర్ కేటాయించాలనగా, అందుకు ప్రతిగా రూ.15,000 లంచం కోరిన రమేష్‌ను, డబ్బులు స్వీకరిస్తున్న సమయంలోనే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరచూ లంచగొండితనాన్ని అరికట్టేందుకు ప్రజలకు పిలుపునిస్తున్న విషయం తెలిసిందే. ఎవరికైనా ఏ ప్రభుత్వ ఉద్యోగి లంచం కోరిన పక్షంలో, వెంటనే తెలంగాణ అవినీతి నిరోధక శాఖను సంప్రదించాలని సూచించారు.

**టోల్‌ఫ్రీ నెంబర్: 1064**
**వాట్సాప్: 9440446106**
**ఫేస్‌బుక్: Telangana ACB**
**ఎక్స్ (Twitter): @TelanganaACB**
**వెబ్‌సైట్: acb.telangana.gov.in**

ఫిర్యాదు దారుల / బాధితుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి అని అధికారులు స్పష్టం చేశారు.

# ప్యాడి కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**శామీర్ పేట ఆగస్టు 19(ప్రజాస్వరం) :**

రాబోయే ఖరీఫ్ సీజన్ 2526 సందర్భంగా రైతుల నుండి ప్యాడి కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధ్యక్షతన అడిషనల్ కలెక్టర్ ఛాంబర్ లో ప్యాడి యాక్షన్ ప్లాన్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్ 2526 సందర్భంగా రైతుల నుండి ప్యాడి కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా, జిల్లాలో 14 ప్యాడి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వాటికి అవసరమైన ఖాళీ సంచుల సమీకరణ, పిపిసిల వద్ద తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, షెడ్ల ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం, మిల్లుల వద్ద గన్నీలు, రవాణా వాహనాలు సిద్ధంగా ఉంచడం, రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్యాడిని విక్రయించే విధంగా పారదర్శక చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మార్కెటింగ్ శాఖ అధికారులు ప్యాడి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సరైన అవగాహన కల్పించి, క్రమపద్ధతిలో టోకెన్లు జారీ చేయాలని, సివిల్ సప్లైస్ శాఖ అధికారులు మిల్లర్లతో సమన్వయం చేస్తూ ప్యాడి రవాణా, నిల్వలో ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ముందస్తు సూచనలు ఇస్తూ తేమ శాతం 17% లోపే ప్యాడిని తీసుకురావాలని, అధిక తేమ ఉన్న పంటను తీసుకురావడం వలన రైతులకు నష్టాలు కలగవచ్చని అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ సమావేశంలో పౌరసఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎల్.సుగుణ బాయి, సివిల్ సప్లైస్ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, జిల్లా సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.




# నూతన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని ప్రారంభించిన ఎస్పీ





**మెదక్ ఆగస్టు 19 (ప్రజా స్వరం)**

నేరానికి సంబంధించి సంఘటన స్థలంలో సాక్ష్యాధారాలను సేకరించేందుకు మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం మెదక్ జిల్లాకు నూతనంగా మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని మెదక్ జిల్లా పోలీసు కార్యాలయములో జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో వున్న పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, అత్యాధునిక పరికరాలతో రూపొందించబడిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని మెదక్ జిల్లా పోలీసులకు మరింత మెరుగైన సేవలందించనిందని అన్నారు. నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బంది ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో చేరుకోని రక్తమరకలు, వ్రేలిముద్రలతో పాటు మరో 14 రకాల ఇతర సాక్ష్యాదారాలను సేకరించవచ్చని అన్నారు. ఈ మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన అధునిక పరికరాలతో పరీక్షలను నిర్వహించి సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యాక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగా నాథ్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మధు సుధన్ గౌడ్, ఆర్ఐ లు శ్రీరామ కృష్ణ, శైలందర్, ఫింగర్ ప్రింట్ ఏఎస్ఐ సీఎచ్. మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి:అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**శామీర్ పేట ఆగస్టు 19(ప్రజాస్వరం)**

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. మంగళవారం కీసర మండలం అంకిరెడ్డిపల్లిలో ఉప్పల్, కుత్బుల్లాపూర్ లకు నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. వంట గది, స్టోర్ ను పరిశీలించి, వంట పదార్థాలపై ఎలాంటి పురుగులు, దోమలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మూతలు ఉంచాలని, భోజనం పూర్తి నాణ్యతగా వండి వడ్డించాలని, ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య లోపం, ఆహారం కలుషితం వంటి కారణాలవల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురి కాకూడదని తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, అంతేకాక పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పాఠశాల ప్రిన్సిపాల్ ను, ఉపాధ్యాయులను ఆదేశించారు. స్కూల్, కాలేజీ స్ట్రెంత్ ఎంత మంది విద్యార్థులున్నారని, బిల్డింగ్ అద్దె ఎంత చెల్లిస్తున్నారని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులలో తిరిగి విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో మీరేం అవుతారని, మీ ఆశయం ఏమిటని అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు విద్యార్థులకు తెలిపారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తూన్నారా అని ఆరా తీశారు. అనంతరం స్టోర్ లోని వంట సామాగ్రిని పరిశీలించి ఎక్స్పైరీ డేట్ ఎప్పటికప్పుడు చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ప్రిన్సిపల్ రాజమణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







# బీసీ రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం కాదు

- **రాష్ట్ర బిజెపి చీఫ్ ఎన్. రామచందర్ రావు**

**వికారాబాద్ (ప్రజాస్వరం):**

వికారాబాద్ లో తెలంగాణ బిజెపి చీఫ్ ఎన్.రామచందర్ రావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే వికారాబాద్ జిల్లాను అనంతగిరి జిల్లాగా మారుస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా జిల్లా పేరును మారుస్తామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు బిజెపి ప్రభుత్వం వ్యతిరేకం కాదని తెలంగాణ బిజెపి ఎన్ రామచందర్ రావు పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లాలో మంగళవారం తొలిసారి పర్యటించిన బిజెపి చీఫ్ కు వికారాబాద్ జిల్లా బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిందిస్తుందని విమర్శించారు . రాష్ట్రానికి కావలసిన యూరియాను కేంద్ర ప్రభుత్వం సమర్ధంగా పంపిణీ చేస్తుందని వివరించారు. సాగునీటి రంగంలో వికారాబాద్ జిల్లా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు భారీ వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం వికారాబాద్ జిల్లాలో భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.



## దళిత యువకుడైన సాయికిరణ్ పై దాడి చేసిన మార్వాడీలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- **తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్**



**కొడంగల్, ఆగస్టు 19 (ప్రజా స్వరం):**

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మొండ మార్కెట్లో దళిత యువకుడైన సాయికిరణ్ పై దౌర్జన్యంగా దాడి చేసిన మార్వాడీలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎరన్ పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరం మొండ మార్కెట్లో నడిరోడ్డు పైన పెట్టిన కారును పక్కకు తీయమని మర్యాదపూర్వకంగా మాట్లాడుతుంటే ఆకారణంగా, దౌర్జన్యంగా సాయికిరణ్ అనే దళిత యువకుడ్ని కులం పేరుతో దూషిస్తూ,దాడి చేసిన మార్వాడీలపై వెంటనే ఎస్సీ/ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మార్వాడి, గుజరాతి,రాజస్థాన్కు చెందిన కొన్ని తెగలు బ్రతుకుతెరువుక కోసం ఈ ప్రాంతానికి వచ్చి ఇక్కడి భాష,సంస్కృతి,సాంప్రదాయాలను దెబ్బతీస్తూ ఇక్కడ అన్ని రంగాల్లో దొంగ దారులో నాసిరకమైన ఉత్పత్తులతో వ్యాపారం చేస్తూ తెలంగాణ కులవృత్తులైన స్వర్ణకారుల(గోల్డ్ స్మిత్), పద్మశాలి(చేనేత), స్వీట్స్, హార్డ్వేర్, కిరాణం అనేక చేతివృత్తులను దెబ్బతీస్తూ ఈ ప్రాంత భాష,సంస్కృతి పై దాడి చేస్తూన మార్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని వాళ్లని అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మన తెలంగాణ రాష్ట్రంలో ఇంకా కొన్ని రాజకీయ పార్టీలు మార్వాడీలు ఇచ్చే చందాలు,ఓట్ల కోసం ఈ ప్రాంత ప్రయోజనాలను పక్కకు పెట్టి వారికి సపోర్ట్ చేసే వివిధ రాజకీయ పార్టీలు ఇప్పుడైనా కళ్ళు తెరవండి లేదంటే తెలంగాణ ప్రజలకు హైదరాబాదులో హక్కులు లేకుండా మరో కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని డిమాండ్ చేస్తారు వాళ్ళు కాబట్టి ఈ ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ వాళ్ల యొక్క దోపిడి, దౌర్జన్యాలను యావత్ తెలంగాణ ప్రజానికం ఎప్పటికప్పుడు పసిగట్టి అరికట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని గుర్తు చేస్తున్నాం! అన్నారు. మన కులవృత్తులు,చేతివృత్తులు, వ్యాపారాలు దెబ్బతిని మనవాళ్లు రోడ్లమీద పడతా ఉంటే మార్వాడి లు ఇచ్చే ఎంగిలి మెతుకుల కోసం సపోర్ట్ చేసే ఏ రాజకీయ పార్టీకైనా రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు కూడా రావాలని కోరారు.

## స్పోర్ట్ స్కూల్ లో ప్రవేశం పొందిన విజ్ఞాన భారతి స్కూల్ విద్యార్థినికి అభినందనలు

**శామీర్ పేట, ఆగస్టు18(ప్రజాస్వరం) :**



తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశం పొందిన విద్యార్థిని తాడి వర్షికను ఆ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. తూంకుంట పరిధిలోని శ్రీ విజ్ఞానభారతి హై స్కూలులో 4వ తరగతి చదువుతున్న తాడి వర్షిక తెలంగాణ స్పోర్ట్ స్కూల్ లో 4 వ తరగతిలో ప్రవేశం పొందింది. ఈ విద్యార్థిని రాష్ట్ర స్థాయి, జయతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ట్రస్మా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గోనె హనుమంత రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ బి జంగా రెడ్డిలు అభినందిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోనె సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




- **ఎస్పీ కె. నారాయణ రెడ్డి**

**వికారాబాద్ ఆగస్టు 19( ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలం కస్లాబాద్ చెరువు (నందివాగు ప్రాజెక్టు) వద్ద ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెరువులో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో, ఎస్పీ స్వయంగా చెరువు కట్టను, ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని మరియు చుట్టుపక్కల ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు.ఈ సందర్శనలో, ఎస్పీ అక్కడి పరిస్థితులపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, ఆయన కొన్ని కీలక సూచనలు జారీ చేశారు.

**అనవసర ప్రయాణాలు మానుకోండి:** చెరువు పరిసర ప్రాంతాలకు అవసరం లేని పక్షంలో ప్రజలు వెళ్లకూడదు. అపరిచితులు, పర్యాటకులు ఈ ప్రాంతానికి దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలు, వృద్ధుల భద్రత ముఖ్యం: చెరువులో నీటి మట్టం పెరిగినందున, తల్లిదండ్రులు తమ పిల్లలను, అలాగే వృద్ధులను చెరువు దగ్గరికి వెళ్లనివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి వేళల్లో కార్యకలాపాలు వద్దు: మత్స్యకారులు మరియు రైతులు రాత్రి వేళల్లో చెరువు దగ్గర కార్యకలాపాలు చేయకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రమాదాల గురించి సమాచారం ఇవ్వండి: చెరువు వద్ద ఎటువంటి ప్రమాదకర పరిస్థితులను గమనించినా, వెంటనే డయల్ 100 లేదా సమీపంలోని పోలీసు స్టేషన్కు సమాచారం ఇవ్వాలి. తద్వారా తక్షణ సహాయక చర్యలు చేపట్టవచ్చని ఎస్పీ తెలిపారు. నిరంతర గస్తీ: ప్రజలకు తక్షణ సహాయం అందించడానికి, చెరువు వద్ద క్రమం తప్పకుండా పోలీసు గస్తీ బలగాలు అందుబాటులో ఉంచాలని ఎస్పీ పోలీసు అధికారులకు ఆదేశించారు.ఈ సమీక్షా కార్యక్రమంలో వికారాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి , మోమిన్పేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. వెంకట్ పాల్గొన్నారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజల భద్రతకు కట్టుబడి ఉందని, విపత్కర పరిస్థితుల్లో అందరూ సహకరించాలని ఎస్పీ కోరారు.



## తాళం వేసిన ఇంట్లో చోరీ

**మెదక్ ఆగస్టు 19 (ప్రజా స్వరం)**



తాళం వేసిన ఇంట్లో గుర్తు చోరీ జరిగిన ఘటన మెదక్ మండలంలో చోటు చేసుకుంది. మంగళవారం మండల పరిధిలోని వెల్కికన్నె సంగయ్య (60) ఇంట్లో సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని దుర్గమ్మ గుడి వద్దకు అతని భార్య తన ఇరుగు పొరుగు వారి తో మంజీర నది లో నీరు భారీగా రావడాన్ని చూసేందుకు ఇంటికి తాళం వేసి వెళ్ళింది. తిరిగి వచ్చి చూసే సమయానికి ఇంటి తాళం పగలగొట్టడం చూసి ఇంట్లోకి వెళ్ళి చూడగా అక్కడ బీరువా తీసి అందులోని సుమారు 14 వేల రూపాయల నగదు, 32 తులాల పట్టా గొలుసులు దొంగలించడం గమనించారు. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ ఎస్ఐ మురళి సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఫోటోగ్రాఫర్ ప్రదీప్ కు కలెక్టర్ సన్మానం

**మెదక్ ఆగస్టు 19 (ప్రజా స్వరం)**

ఒక ఛాయాచిత్రం వేయి పదాలకు అర్థం చెబుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఫోటోగ్రాఫర్ గా విధులు నిర్వహిస్తున్న ప్రదీప్ ను కలెక్టర్ రాహుల్ రాజ్ శాలువాతో సన్మానించి మెమొంటో అందించారు. జిల్లాలో ఉన్న ఫోటోగ్రాఫర్ లందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల కార్యక్రమాలను సృజనాత్మకతను పదును పెట్టి ఫోటోలు తీయడంలో దిట్ట ప్రదీప్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు

## నా ఎదుగుదలను ఓర్వలేక కొంత మంది వ్యక్తులు నా ఫ్లెక్సీలు ధ్వంసం చేస్తారు




**భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాస్వరం**

మణుగూరు మండలం గ్రామ నివాసి అయిన సామాజిక కార్యకర్త న్యాయవాది కర్నే రవి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతిపై ఉక్కు పాదం మోపుతూ అన్యాయం జరిగిందంటే ముందుండే వ్యక్తి నేను. రానున్న పంచాయతీ ఎలక్షన్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తూ పళ్ళు ఫ్లెక్సీలను పబ్లిక్ సిటీ కోసం అతికించుకున్న ఫ్లెక్సీలను కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే నా ఎదుగుదలను ఓర్వలేక ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. అంతేకాకుండా 17వ తారీకు ఆదివారం కిన్నెర కల్యాణ మండపం లో జరుగుతున్న సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజ అయోధ్య గారి సంతాప సభ కార్యక్రమం కోసం వారి అభిమానిగా నా ఫోటో వేసుకొని పూల మార్కెట్ చౌరస్తాలో కట్టిన ఫ్లెక్సీ ఫ్రేమ్ తో పాటు మాయం చేశారు అంటే అర్థం చేసుకొండి తోగ్గుడెం సమ్మక్క సారక్క గుడి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని నా మీద ఎంత కోపంగా ఉంటే అంతగా చింపారో మణుగూరు మండలం లోని ప్రజలు ఆలోచించండి..? ఈ విషయం పై మణుగూరు పోలీస్ స్టేషన్ లో ఈరోజు ఉదయం ఫిర్యాదు చేయడం జరిగింది దిని పైన విచారణ జరిపి ఈ చర్యకు పాల్పడిన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.!



## బండి సంజయ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలియజేసిన దళిత కాలనీవాసులు

**రామడుగు, ప్రజాస్వరం:**

రామడుగు మండలం గంగసాయిపల్లి గ్రామంలో దళిత కాలనీలో బండి సంజయ్ కుమార్ కు నీటి సమస్య ఉందని తెలిపిన వెంటనే స్పందించి బోరు వేయించినందుకు కేంద్ర మంత్రివర్యులు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ కు రంగసాయిపల్లి ఎస్సీ కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. తక్కువ లోతులో నీరు రావడంతో మోటార్ బిగించిన తర్వాత నీరు బయటకు రావడాని చూసి ఎస్సీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆనందోత్సవంతో స్వీట్లు పంపిణీ చేశారు. ఇందుకు సహకరించిన రామడుగు మండల బిజెపి మండల అధ్యక్షుడు ఒంటెల కర్ణాకర్ రెడ్డి మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ శక్తికేంద్రం ఇన్చార్జి కట్ట రవీందర్ గార్లకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మునిగంటి శ్రీనివాస్ చారి రంగసాయి పల్లె గ్రామ బూత్ అధ్యక్షుడు మండల శేఖర్ లింగంపల్లి శ్రీనివాస్ కార్యకర్తలు బాసరవేణి శేఖర్ నీలం రవి కోటగిరి ప్రశాంత్ చారి ఓరిగంటి మహేష్ చిలుముల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## అచ్యుతాపురంలో రూ.23.88 కోట్ల ఆల్ప్రాజోలం పట్టివేత

- **8 మంది అరెస్ట్.**

**అనకాపల్లి, ప్రజాస్వరం :**

అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురంలో భారీగా ఆల్ఫాజోలం పట్టుబడింది. అలానే దీనిని తరలిస్తున్న 8 మందిని డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. రూ.23.88 కోట్ల విలువ చేసే 119.4 కిలోల ఆల్ఫాజోలంను స్వాధీనం చేసుకున్నారు. ఓ గిడ్డంగిలో తయారు చేసి డెలివరీకి సిద్ధంగా ఉన్న ఆల్ఫాజోలంను నిందితుల నుంచి కస్టమర్లు కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడకు చెందిన డీఆర్ఐ అధికారులు కలిసికట్టుగా నిర్వహించిన ఆపరేషన్‌లో వీరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆల్ఫాజోలంతోపాటు 87.8 కిలోల ముడి సరకును కూడా డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- **డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్య నారాయణరెడ్డి**

**అమరావతి, ప్రజాస్వరం:**

కూటమి ప్రభుత్వం మరో సూపర్ సిక్స్ ఎన్నికల హామీని నెరవేర్చి ముందుకు సాగిందని అని డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్య నారాయణ రెడ్డి పేర్కొన్నారు.మహిళలకు స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 15 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికి ప్రయాణం చేయాలన్నా టికెట్ లేని ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది మహిళలు ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు ఏదో ఒకటి చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు అని అన్నారు. 'స్త్రీ శక్తి' పథకంలో భాగంగా పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించబడుతుంది అని అన్నారు.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు అని అన్నారు.

# విరామం ఎరుగని మంత్రి సీతక్క

- **ఎక్కడ ఉన్నా ములుగు ఆలోచనే**

**ములుగు, ప్రజాస్వరం :**




ములుగు జిల్లాలో వరద పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి సీతక్క. ములుగు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల ప్రభావం నేపథ్యంలో పరిస్థితిని సమీక్షిస్తూ మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చెరువులు, కుంటల నీటి మట్టం, వాగులు, వంకల పరిస్థితులపై అధికారులు మంత్రికి నివేదిక సమర్పించారు. ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వరద ప్రాంతాల్లో మానవ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు. చేవెళ్ల ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, హైదరాబాద్ తిరుగు ప్రయాణం మధ్యలోనే మంత్రివర్యులు ఈ సమీక్ష జరపడం విశేషం. ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని గుర్తు చేస్తూ, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు అందించడానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్ సిద్ధంగా ఉంచాలని, వరద ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగినంత ఆహారం, తాగునీరు, వైద్య సహాయం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రతి వాగుపై పట్టు ప్రజా రక్షణలో మంత్రి సీతక్క ముందంజ. భౌగోళిక పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన నాయకులే ప్రజాసేవలో గొప్పగా రాణిస్తారని ఎన్నోసార్లు రుజువైంది. ఇప్పుడు ఆ జాబితాలో మంత్రి సీతక్క కూడా నిలిచారు. తన నియోజకవర్గంలోని ప్రతి చెరువు, వాగు, తోగు, కుంటపై సంపూర్ణ అవగాహనతో, వాటి పేర్లను వేళ్లమీద లెక్కపెట్టినట్టుగా పలుకుతూ, వరద పరిస్థితులపై అధికారులు ఇచ్చిన నివేదికలను సమీక్షించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. కొండాయి, భూటారం, జంపన్న వాగు, ప్రాజెక్ట్ నగర్ వాగు, గుండ్ల వాగు, కాల్వపల్లి--- ఇలా ప్రతి వాగుపై ప్రత్యేక పట్టు ఉన్న సీతక్క, అక్కడి పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. జంపన్న వాగు సహా ములుగు జిల్లాలోని అన్ని వాగుల పరిస్థితిపై నిశితంగా దృష్టి పెట్టి, ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను తక్షణం సురక్షిత ప్రదేశాలకు తరలించాల్సిందిగా కలెక్టర్‌తోపాటు సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. వచ్చే రెండు మూడు రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. రాత్రివేళల్లో సైతం అధికారులు విధుల్లో ఉండేలా పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలు వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి వాగు నీటి స్థితిని గంట గంటకూ అంచనా వేసి, అవసరమైతే వెంటనే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క హితవు పలికారు. ప్రజల ప్రాణాలకు మించినది ఏదీ లేదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చు, అని మంత్రి సీతక్క స్పష్టం చేయడం ద్వారా ప్రజా రక్షణపై తన అపారమైన కట్టుబాటును మరోసారి చాటిచెప్పారు.

## క్యాపిటల్ & ఇన్వెస్ట్మెంట్స్ సబ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మంత్రి కోమటి రెడ్డి

**హైదరాబాద్, ప్రజాస్వరం:**




మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం నాడు క్యాపిటల్& ఇన్వెస్ట్మెంట్స్ సబ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర సచివాలయం 6వ ఫ్లోర్ లో సమావేశం జరిగింది. డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రీధర్ బాబు,సీతక్క తదితరులు హజరయ్యారు. చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు,అన్ని శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు,పలువురు అధికారులు పాల్గోన్నారు.మంత్రి మాట్లాడుతూ ఇన్ఫ్రాస్ట్రక్చర్ & క్యాపిటల్ వర్క్స్ సబ్ కమిటీ ఏర్పాటు చేసుకున్నది పనుల పురోగతి కోసం. రాష్ట్ర ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖలు నిత్యం ప్రజలకు కనెక్ట్ అయి ఉండే శాఖలు, రాష్ట్ర రాజధాని నుండి జిల్లా కేంద్రాలు,మండల కేంద్రాలకు మంచి రోడ్ల కనెక్టివిటీ ఉంటే గ్రామీణ ప్రాంతాలకు కూడా ఇండస్ట్రీస్ వెళ్తాయని అన్నారు.దీంతో రూరల్ లోనే ఉద్యోగ, ఉపాధి కల్పన ఏర్పడుతుంది. ఉద్యోగం,ఉపాధి హైదరాబాద్ లోనే కాదు తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో ఎక్కడైనా దొరుకుతుందనే భావన సృష్టించాలి. అందుకు ప్రజలకు మొదటి ప్రాధాన్యతగా మంచి రోడ్లు ఉండాలి. మంచి రోడ్లు ఉంటే ప్రజా రవాణా, ప్రభుత్వం పై ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. అత్యవసర సమయంలో అంబులెన్స్ వెళ్లాలన్న రోడ్ స్పీడ్ ను పోల్చి చూస్తారు. రోడ్ల కోసం నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ఎక్కడా వెనుకాడొద్దు అనేది ఫైనాన్స్ మినిస్టర్ భట్టి ,సహచర మంత్రులకు నా సూచన అని అన్నారు. హ్యామ్ విధానంలో చేపట్టాల్సిన రోడ్లను స్పీడప్ చేయాలి..3ఏళ్లలో యాక్సిడెంట్స్ కు ఆస్కారం లేని మంచి రోడ్లు అందుబాటులోకి రానున్నాయి. కాంట్రాక్టర్ల పేమెంట్ విషయంలో వారికున్న అభద్రతా భావాన్ని తొలగించాల్సిన బాధ్యత మనపై ఉంది. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక తప్పిదాలు ప్రస్తుతం మనకు ఇబ్బందిగా మారాయని అన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు ఆగస్టు 30కి పెంపు

**మంథని, ప్రజాస్వరం :**

202526 విద్యా సంవత్సరానికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బి.ఎ., బీ.కాం., మరియు బీఎస్సీ కోర్సులలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకై గడువు ఆగస్టు 30 వరకు పెంచినట్లు అభ్యాసకుల సహాయ కేంద్రం సమన్వయకర్త కార్నాటి కృష్ణ మరియు మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా లు తెలియజేశారు. రెగ్యులర్ లేదా ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్ లేదా ఐటిఐ మొదలైన రెండేళ్ల కోర్సును పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ ఓపెన్ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. సమత ఫ్రీ షిప్ కార్యక్రమం ద్వారా ఆదివాసీలు, ఆదిమ తెగలు, శారీరక వికలాంగులు, ట్రాన్స్ జెండర్లకు ఉచిత విద్యను అందజేస్తుందని అన్నారు. దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా యూనివర్సిటీ వెబ్ సైట్ లో చేసుకోవచ్చు. అలాగే రెండవ మరియు మూడవ సంవత్సర విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజును చెల్లించాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు కళాశాలలోని అభ్యాసకుల సహాయ కేంద్రాన్ని లేదా మొబైల్ నెంబర్ 7382929649 లో సంప్రదించగలరని వారు తెలిపారు.

## రైతులకు సకాలంలోనే యూరియా అందిస్తాం

- **కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల ప్రభుత్వం**
- **వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలోనే పంపిణీ**
- **మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న**

**మంథని, ప్రజాస్వరం:**



మంథని మండలంలో రైతుల అవసరాల కొరకు మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చొరవతో యూరియా దిగుమతులు చేసుకోవడం జరిగిందని, రైతులకు సకాలంలోనే యూరియా అందిస్తామని మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న తెలిపారు. మంగళవారం మంథని మండలం వెంకటాపూర్ సింగిల్ విండో గోదామును చైర్మన్ కుడుదుల వెంకన్న సందర్శించి యూరియా నిలువల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల ప్రభుత్వమని ఆయన అన్నారు. రెండు వేల యూరియా బస్తాలు మంథనికి రావడం జరిగిందని సహకార సంఘం మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలలో నిలువ చేశామన్నారు. వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు పట్టా పాస్ బుక్ జిరాక్స్ మరియు ఆధార్ కార్డు చూపించి టోకెన్ పొందిన రైతులకు యూరియా అందజేయడం జరుగుతోందన్నారు. మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు అధికారుల పర్యవేక్షణలో దళారులకు అందకుండా యూరియా దుర్వినియోగం కాకుండా రైతులకు యూరియా అందించడం జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న తెలిపారు.

## బూర్జ అరకులోయ మండలంలో విలీనం చేయాలి

**అరకులోయ, ప్రజాస్వరం**




అరకులోయ నియోజకవర్గం. బూర్జ హుకుంపేట మండలం నుంచి అరకులోయ మండలంలో విలీనం చేయాలని బూర్జ గ్రామస్తులు వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు డిమాండ్ చేశారు వార్డు సభ్యులు భాస్కర్ రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ బూర్జ హుకుంపేట మండలం నుంచి అరకు లోయ మండలంలో విలీనం చేయాలని వినతిని ప్రభుత్వం తమ గోడును అంగీకరించాలన్నారు బూర్జకి హుకుంపేట మండలానికి 30 నుంచి 40 కిలోమీటర్లు దూరం ఉండటంతో తీవ్ర వ్యయాప్రాయాసలకూర్చాల్సి వస్తుందని బూర్జ అరకులోయ మండలం కేవలం 15 కిలోమీటర్లు దూరం మాత్రమే ఉండటంతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో వెసులుబాటుగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు అంశాలన్నిటిని పరిగణలోకి తీసుకొని బూర్జ హుకుంపేట మండలం నుంచి అరకులోయ మండలంలో విలీనం చేయాలని వార్డు సభ్యుడు భాస్కరరావు గ్రామస్తులు చిన్న బాబు మోహన్ రావు రామమూర్తి సొమ్ము రామకృష్ణ.హరి.మూర్తి.నిన్ను. మజ్జి వెంకట స్వామి.శంకర్. జానుబాబు..భీమరాజు. తదితరులు పాల్గొన్నారు



## మంథనిలో తాళం వేసిన ఇంట్లో మరో చోరి

- **ఈ వరుస దొంగతనాలతో భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు**

**మంథని, ప్రజాస్వరం:**

మంథని పట్టణంలోని రావు చెరువు కట్ట వీధిలో గల రాంపల్లి ఆనంద్ కు చెందిన తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఆనంద్ దాదాపు గత పది రోజులుగా సొంత పనుల నిమిత్తం వరంగల్ లో నివాసం ఉంటున్నాడు. ఆనంద్ కు తెలిసిన వ్యక్తిని తమ ఇంటి వైపు వెళ్లి చూడమని ఆనంద్ చెప్పడంతో ఆ వ్యక్తి సోమవారం సాయంత్రం ఇంటికి వెళ్లి చూడగా ఇంటి కిటికీలను తొలగించి, తాళాలను పగులగొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడినట్లు గ్రహించి ఇంటిలోపల సామాన్లు, బట్టలు అనుమానాస్పదంగా పడి ఉన్న విషయాన్ని వెంటనే ఆనంద్ కు ఫోన్ లో ఈ విషయాన్ని తెలిపాడు. ఏం నష్టం జరిగిందో పోలీస్ విచారణలో తెలియాల్సి ఉంది.ఈ దొంగతనం ఎప్పుడు జరిగిందో కూడా తెలియని పరిస్థితి నెలకొని ఉంది. ఇంటి యజమాని ఆనంద్ మంథని కి వస్తేగానీ ఏం పోయిందో తెలిసే అవకాశం ఉంది.పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.



# జనరిక్ మందుల ప్రమోషన్ కై చర్యలు తీసుకోవాలి

- **జనరిక్ మందులు వ్రాయని డాక్టర్ల పై చర్యలు తీసుకోవాలి**
- **గ్రీవెన్స్ లో హనుమకొండ కలెక్టర్ కు పిర్యాదు చేసిన తెలంగాణ హాస్పిటల్స్, పేరెంట్స్ కోఆర్డినేషన్ కమిటి**

**హనుమకొండ, ప్రజాస్వరం :**

ప్రజా ఆరోగ్యం కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న తెలంగాణ ప్రభుత్వం మందుల వినియోగం, ప్రజా ఆరోగ్యం, డాక్టర్ల పని తీరుపై శ్రద్ధ తీసుకోవడం లేదని, జనరిక్ మందులు వ్రాయడం, ఇతర ప్రజా ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం విడుదల చేసిన జి.ఒ లను అమలు చేయాలని తెలంగాణ హాస్పిటల్స్ పేరెంట్స్ కోఆర్డినేషన్ కమిటి రాష్ట్ర అధ్యక్షులు బి. సతీష్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ సంయుక్తంగా హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ కు ఇచ్చిన పిర్యాదులో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2011 లో జారీ చేసిన జి.ఒ.ఎం.ఎస్ నంబర్ 54, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2016 లో జారీ చేసిన అతిసాదారణమైన నోటిఫికేషన్ పార్ట్ 3, సెక్షన్ 4 ప్రకారం మెడికల్ కౌన్సిల్ లో రిజిస్టర్ అయిన ప్రతి డాక్టర్ వారు వ్రాసే మందులను జనరిక్ పేర్లతో మాత్రమే వ్రాయాలని నిబంధన ఉన్నప్పటికీ చాలా మంది డాక్టర్లు వ్రాయడం లేదని ఆ పిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే డాక్టర్లపై, హాస్పిటల్స్ పై వృత్తిపరమైన చెడు ప్రవర్తనకు పాల్పడినందుకు క్రమశిక్షణ చర్యలతో పాటు, అపరాధ రుసుము వేసి చర్యలు తీసుకునే అధికారం ఉన్నతాధికారులకు ఉందని నిబంధనలు ఉన్నపటికీ అలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, ఎంసిఐ నిబంధనల ప్రకారం వివిధ ప్రజా ఆరోగ్య సమస్యలు, జనరిక్ మందుల వినియోగం కోసం ప్రజలను చైతన్యం చేయడంతో పాటు, అమలు తీరుపై సమీక్ష జరపడం కోసం జిల్లా కలెక్టర్ చైర్మన్ హోదాలో జిల్లా స్థాయి కమిటీ (డి ఎల్ సి) నియమించాలని సూచనలు ఉన్నపటికీ అలాంటి కమిటీ నియమించలేదని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వెంటనే పేరెంట్స్, అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు ఫార్మసీ కంపెనీలతో కుమ్ముక్కైన డాక్టర్ల దోపిడీని అరికట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఎఫ్ నాయకులు ఐతం నగేష్, న్యాయవాదులు మొగిలయ్య, ఎగ్గడి సుందర్ రామ్ లు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్ట కు మూడు ఐ ఎస్ ఓ, గుడ్ గవర్నన్స్ సర్టిఫికెట్స్

- **దేశంలోనే ఎనర్జీ ఆడిట్ ను నిర్వహించిన తొలి ఆలయంగా యాదగిరిగుట్ట**
- **డిప్యూటీ సి.ఎం చే అందుకున్న ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, గుట్ట ఈ.ఓ వెంకట్ రావు.**

**హైదరాబాద్, ప్రజాస్వరం:**

యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ ఆలయానికి నాలుగు ISO 9001 , ISO 22000 లతో కలిపి నాలుగు సర్టిఫికేషన్ పురస్కారాలు యాదగిరి గుట్ట లయానికి లభించాయి. దేశంలోనే ఎనర్జి ఆడిట్ నిర్వహించిన మొట్ట మొదటి ఆలయంగా, స్వామివారి అన్న, ప్రసాదాల విషయంలో అత్యంత ఉన్నత ప్రమాణాలు, గుట్ట సందర్శనకు వచ్చే యాత్రికులకు మెరుగైన , సంతృప్తికర సౌకర్యాలు కల్పించడం, భక్తులకు సంతృప్తికరమైన దైవ దర్శనం కల్పించడం, తదితర అంశాలకు ఈ నాలుగు అవార్డులు లభించాయి. గత రెండు నెలలుగా విజయవంతంగా ఐఎస్ఓ ఇన్స్పెక్షన్ సర్టిఫికేషన్, ఆడిట్ ను HYM ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ఆధ్వర్యంలో గుట్టలో నిర్వహించారు.. కాగా ఈ ISO సర్టిఫికెట్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దనసరి అనసూయ, సి.ఎస్ రామకృష్ణా రావు ల సమక్షంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఎండోమెంట్ కమీషనర్, యాదగిరిగుట్ట కార్యనిర్వహణాధికారి వెంకట్ రావు లకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎస్.ఓ సర్టిఫికేషన్ బాధ్యులు ఆలపాటి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణిలో 386 దరఖాస్తులు

- **దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 386 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 76, రెవెన్యూ శాఖకు సంబంధించి 35, ప్రవాసి ప్రజావాణికి 02, విద్యుత్ శాఖకు 29, ఇందిరమ్మ ఇండ్ల కోసం 169 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 75 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# ఒక్క ఫోటో వెయ్యి భావాలను తెలియచేస్తుంది

- **రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్, ప్రజాస్వరం**



ఒక్క ఫోటో వెయ్యి భావాలను తెలియచేస్తుందని, రాష్ట్రంలో ఫోటోజర్నలిస్టుల సంక్షేమానికి వారిలో ప్రొఫెషనలిజం పెంపొందించేందుకు చర్యలు చేపడుతామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలలో విజేతలకు నేడు బహుమతి, నగదు పురస్కారం అందించే కార్యక్రమానికి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పంజాగుట్టలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సమాచారశాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్. ప్రియాంక, సిఎం కార్యాలయం సీపీఆర్ఓ మల్సూర్‌లు అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, కాలాన్ని బంధించి మధుర స్మృతులను అందించే శక్తి ఒక్క ఫోటోగ్రఫర్లకే ఉంటుందని, వారిని ప్రోత్సహించే దిశగా ప్రతీ సంవత్సరం వరల్డ్ ఫోటోగ్రఫీడేను అధికారికంగా నిర్వహించి, ఫోటో కాంపిటిషన్లలో విజేతలను నగదు బహుమతులు, మెమెంటోలను ప్రదానం చేస్తున్నామని వెల్లడించారు. మాయని జ్ఞాపకాల, తీయాని కల ఫోటోగ్రఫీ అని పేర్కొంటూ, ఎన్నో దశాబ్దాలు గడిచినా ఒక్క ఫోటో మాయని గత స్మృతుల్ని తెలియచేస్తుందని అన్నారు. రాజీవ్ గాంధీ హత్యోదంతాన్ని గుర్తు చేస్తూ, ఆ సంఘటనలో ఉన్న ఫోటోగ్రాఫర్ తీసిన చిత్రం ద్వారానే హంతకులను పట్టుకున్న ఉదంతాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేది ఫోటో జర్నలిస్టులని అన్నారు. స్వాతంత్రోద్యమం నుండి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రచార మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వీటిలో ఫోటోగ్రఫీకి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక మాట్లాడుతూ, కాలం గడచినా, ఫోటోలు మాత్రం చెక్కుచెదరకుండా గత మధుర స్మృతులను మిగులుస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాలన్నీ సమాచార శాఖ ఆధ్వర్యంలో గత 28 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి 5 విభాగాలకు నిర్వహించిన ఫోటో కాంపిటీషన్‌కు 94 మంది పాల్గొని 744 ఫోటోలను పంపించారని చెప్పారు. ఫోటోగ్రఫీ రంగంలో నిష్ణాతులైన వారిచే ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ విజేతలను ఎంపిక చేసిందని వివరించారు. ప్రధానంగా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రాజీవ్ యువ వికాసం, జనరల్ అనే ఐదు విభాగాలుగా ఎంట్రీలను ఆహ్వానించి ప్రతీ విభాగానికి 8 బహుమతులను ప్రకటించామని తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ పోటీలలో పాల్గొన్న విజేతలకు నగదు , శాలువాతో పాటు మెమెంటోను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సి.ఎస్. రామకృష్ణా రావు, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీపీఆర్ఓ మల్సూర్‌లు అందచేశారు.

# జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు

- **అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్ మొబైల్ చెక్ ద్వారా వేలిముద్రలు సేకరణ..**
- **మద్యం మత్తులో పట్టుబడిన వారిపై కేసులు నమోదు**

**ఖమ్మం, ప్రజాస్వరం :**



ఇటీవల రాత్రివేళలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టే దిశగా మరింత పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు పర్యవేక్షణలో రాత్రి పోలీసులు ఎక్కడికక్కడ మోహరించి డ్రంకన్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్ మొబైల్ చెక్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. మద్యం సేవించి పట్టుబడిన వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వారికీ న్యాయస్థానంలో జైలు శిక్ష, జరిమానాలు పడేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో బ్యారికేడింగ్, ప్రమాద సంకేత సూచిక బోర్డులు, స్టాపర్స్, సిగల్ లైట్స్, బ్లింకింగ్ లైట్స్ ఏర్పాటు చేసి ప్రమాద నివారణ చర్యలను చేపట్టారు. జాతీయ రహదారులపై నియంత్రణ లేని నిర్లక్ష్యమైన రాష్ డ్రైవింగ్, హెల్మెట్ ధరించకపోవడం, మద్యం మత్తులో డ్రైవ్, త్రిబుల్ రైడింగ్ చేయడం ద్వారానే ద్విచక్ర వాహనదారులు ఎక్కువ సంఖ్యలో ప్రమాదానికి గురై మరణిస్తున్నారని నివేదికలు చెపుతున్న నేపథ్యంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి రోజు ఖచ్చితంగా డ్రంకెన్ & డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్లు ధరించని వాహనదారులుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రమాదల సంఖ్య తగ్గించవచ్చని పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అదేశించారు.ముఖ్యంగా మద్యం మాత్తులో రోడ్లపైకి వస్తున్న కొందరు వాహనదారులు, ఇతరుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని, ఈ క్రమంలోనే ఇలాంటి వారిపై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టాలని అదేశించారు. ఎక్కడైనా వాహనం బ్రేక్డౌన్ అయిన అప్పుడు పక్కన రాళ్లు చెట్టుకొమ్మలు పెడుతున్నారని, రాత్రి సమయాలలో అవి కనపడక ఆగి ఉన్న వాహనాలను ఢీకోట్టడం జరుగుతోందని, దానివల్ల కూడా ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది అన్నారు.. ఈ ఏడాది జనవరి నుండి ఆగస్టు 17వ తేదీ వరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 10,141 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిపై పోలీసులు వివిధ కోర్టుల్లో ఛార్జ్‌షీట్లు దాఖలు చేశారు. ఈ ఏడాది ఏడు నెలలలో టూ, త్రీ వీలర్స్, 4 వీలర్స్, ట్రాక్టర్లు, టెంపోలు, టిప్పర్లు, బస్సు,లారీలు తదితర 607 రోడ్డు ప్రమాదాలు సంభవించగా, 225మంది మృతిచెందగా, 526 మంది గాయపడ్డారని వివరించారు.ఇందులో 150 ద్విచకవాహన ప్రమాదల్లో 69మంది మృతి చెందారు. ఈ తనికీలలో సి ఐ లు, ఎస్ ఐ లు పాల్గొన్నారు.



# వినాయక విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- **విగ్రహాల ఏర్పాటు కు ఆన్లైన్ ద్వారా సమాచారం అందించాలి**
- **నిబంధనలకు లోబడి నడుచుకోవాలి.**
- **పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా**


**గోదావరిఖని, ప్రజాస్వరం :**

ఈ నెల 27న బుధవారం నాడు వినాయక చవితి పండుగ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి మంచిర్యాల్ జోన్ పరిధిలో మండపాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఉత్సవాలు జరుపుకోవాలనుకునేవారు తప్పనిసరిగా పోలీస్ శాఖ నుండి అనుమతి పొందాలని, ఆన్లైన్ ద్వారా విగ్రహాల ఏర్పాటు కు సంబంధించిన పూర్తి సమాచారం ఆన్లైన్ ద్వారా అందించాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ https://policeportal.tspolice.gov.in/index.htm ఆన్లైన్ లింక్ ను క్లిక్ చేసి అందులో దరఖాస్తు దారుని వివరాలు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, అది ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న మండపం ఎత్తు, కమిటీ సభ్యులు పేర్లు వారి ఫోన్ నెంబర్లు, విగ్రహం ప్రతిష్టించే రోజు, నిమజ్జనం చేసే తేదీ సమయం, ప్రదేశం, ఆ ప్రదేశానికి ఏ వాహనంలో చేరుకుంటారు, అదేవిధంగా మండప నిర్వహకులు, గణపతి కమిటీ సభ్యులు, వాలంటీర్ల వివరాలు, ఫోన్ నెంబర్లు చిరునామా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని పట్టణాలలో మరియు గ్రామాలలో నిర్వహించే గణపతి మండప నిర్వహకులు ఈ వెబ్సైట్ నందు వివరాలను పొందుపరచాలని సూచించారు. ఆన్లైన్ ద్వారా వివరాలు కాని సందర్భంలో దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయక ప్రతిష్టాపనకు ప్రాధాన్యత కేటాయించాలని తెలిపారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా కమీషనరేట్ పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో అప్రమత్తంగా ఉంటుందని వెంటనే డయల్ 100 కు సంప్రదించాలని తెలియజేశారు. మండపాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకొని ఉత్సవాలు నిర్వహించే వారు తప్పని సరిగా పోలీస్ శాఖ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సీపీ తెలిపారు.

# అప్పుడు ఆనకట్టలు కట్టలేదు... ఇప్పుడు నీళ్లు ఆపడం లేదు

- **కన్నీళ్లు తుడిచిన కాళేశ్వరంపై విషం చిమ్ముతుండ్లు**
- **పార్వతి బ్యారేజ్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని, ప్రజాస్వరం :**



40ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు గోదావరినదిపై ఆనకట్టలు కట్టాలనే ఆలోచన చేయలేదని, ఈనాడు అధికారంలో ఉండి వృధాగా పోతున్న నీటిని ఆపాలని చూడటం లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీని గోదావరి విలాపం అనే పేరుతో స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ బారీ వర్షాలు పడి ఎగువనుంచి బారీగా వరద నీరు చేరి గోదావరినది నిండుగా ప్రవహిస్తోందని, నీళ్లు వృధాగా పోతుంటే గోదావరిననది కన్నీరు పెట్టుకుంటుందన్నారు. ఈనాడు లక్షల క్యూసెక్కుల నీళ్లు వృధాగా ఉప్పు నీళ్లలో కలిపేస్తున్నారని, తనను ఎవరికి ఉపయోగపడకుండా చేస్తున్నారని గోదావరిమాత గోస వెల్లబోసుకుంటుందన్నారు. ఆనాడు ప్రకృతికి విరుద్ధంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రివర్స్ పంపింగ్ చేసి నీటిని పైకి తీసుకువస్తే శాపం తగులుతుందని అనుకున్నా కానీ నేడు నీళ్లన్ని వృధాగా పోయి సముద్రంలో కలుస్తుంటే ఆనాడు కేసీఆర్ చేసిన ఆలోచన ఎంతో గొప్పదని గోదావరినది చెప్తోందన్నారు. నీళ్లు వృధాపోతున్నా ఆపాలనే ఆలోచన చేయకుండా ఇటు రైతులకు, ప్రజలకు ఉపయోగపడకుండా చేస్తున్నారని గోదావరినది మొరపెట్టుకుంటుందని, కళ్లున్న కాంగ్రెస్ నాయకులకు గోదావరి నది గోస కన్పించడం లేదా అని ప్రశ్నించారు. ఆనాడు సాధ్యం కాదనుకున్న ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల కన్నీళ్లు తుడిచిన కేసీఆర్‌పై, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ విషం చిమ్ముతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు ఆపితే ప్రాజెక్టు కట్టినోళ్లకు పేరు వస్తుందనే ఆలోచనతోనే ముఖ్యమంత్రి కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ బరాజ్ దెబ్బతిందని చెప్తున్నారని, కానీ పార్వతీ బరాజ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకున్నా గేట్లు ఎత్తి నీళ్లను ఎందుకు వృధా చేస్తున్నారో జవాబు చెప్పాలన్నారు. ఒక ప్రాంతానికి పరిశ్రమనో ప్రాజెక్టు వస్తే దానిలో ఏదైనా సమస్య ఉంటే అక్కడి నాయకులు సరిచేసి ఉపయోగంలోకి తీసుకురావాలే తప్ప దానిని పూర్తిగా పనికి రాకుండా చేయవద్దని హితవుపలికారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు కళ్లు తెరిచి ఇప్పటికైనా వృధాగా పోతున్న గోదావరినీళ్లను ఆపి ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. సిరిపురం బరాజ్‌లో నీటిని ఆపితే ఈప్రాంతంలో రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, గ్రౌండ్ వాటర్ పెరిగి వేసవి కాలంలోసైతం నీటి సమస్య తీరుతుందని ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్న మత్స్యకారులకు సైతం ఉపాధి మెరుగుపడుతుందని, ప్రభుత్వం ఈ ప్రాంత పాలకులు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు యెగోళపు శంకర్ గౌడ్,గుజ్జుల రాజిరెడ్డి, ఆరేపల్లి కుమార్,తగరం శంకర్ లాల్, మిర్యాల ప్రసాదరావు, కాయితి సమ్మయ్య, మాచిడి రాజు గౌడ్, కొండ రవీందర్, కనవేణ శ్రీనివాస్ యాదవ్, ఇర్ఫాన్, అసిఫ్ ఖాన్, పోలు కనుకరాజు లతో పాటు పలువురు పాల్గొన్నారు.